సాక్షి రంగారెడ్డి

సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



డివైడర్ ఎక్కించి..

తాగిన మైకంలో డీసీఎం డ్రైవర్ రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఎక్కించి అవతలి వైపు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. 8లో▸

నెక్నాంపూర్ చెరువు పరిశీలన

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చిన్న చెరువును ఆదివారం రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు వద్ద ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పనుల గురించి తెలుసుకున్నారు. కొత్తగా చెరువులో ప్రవేశపెట్టిన తేలియాడే క్లీనింగ్ సైకిల్‌లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులు, వాగులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కోర్టు భవనాలకు నిధులు మంజూరు

మహేశ్వరం: మహేశ్వరం కోర్టు కాంప్లెక్స్‌లో రెండు నూతన భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేసిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయవాదుల విన్నపం మేరకు విషయాన్ని న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

రేపు మెగా జాబ్ మేళా

చేవెళ్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 25న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులకోసం మ్యాజిక్ బస్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, టీఎస్‌కేసీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిగ్రీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, బయోడేటా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో రావాల్సి ఉంటుందన్నారు. ఆయా విద్యార్హతలను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించటం జరుగుతుందన్నారు. వివరాలకు 91601 08844 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అనుమానాస్పదస్థితిలో కారు దగ్ధం



కొత్తూరు: అనుమానాస్పదస్థితిలో కారు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని మల్లాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల మేరకు మల్లాపూర్‌లోని ఓ పార్కింగ్ స్థలంలో నిలిపిన కారు దగ్ధమైందనే సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. పరిశీలనలో కారు ఇటీవల గ్రామంలో చోటు చేసుకున్న డాక్యుమెంట్ రైటర్ కరుణాకర్‌రెడ్డి హత్యకేసులో నిందితుడు విక్రమ్‌రెడ్డికి చెందినదిగా గుర్తించారు. విక్రమ్‌రెడ్డి ఇదివరకే కారును ఇతరుల నుంచి కొనుగోలు చేయగా ఇంకా తనపేరుపై రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి



మాట్లాడుతున్న రవీంద్రచారి

కందుకూరు: నరేంద్రమోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ 'మోదీకి హటావో దేశ్‌కో బచావో' నినాదంతో పార్టీ మండల కార్యదర్శి కె.రాజు ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ అనుసంధానంలో మనువాద రాజ్యాంగాన్ని నిర్మించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం అన్ని వర్గాల ప్రజలకు శ్రీరామ రక్ష, అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణలో ధరణి పేరుతో అనేక భూ సమస్యలు పరిష్కారం కాకుండా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం ధరణిలో సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎర్ర గణేశ్, నాయకులు రాజు, అంజి, ఊట్లపల్లి రవి, నరసింహ, నవీన్, రమేష్, చెన్నయ్య, బ్రహ్మాచారి, ఆదిలక్ష్మి, శ్రీకాంత్, శ్రావణి, ఉష తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉదయ్ ప్రకాష్ పేర్కొన్నారు. మహాత్మా బసవేశ్వర 890వ జయంతి ఉత్సవాలను జిల్లా వెనకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉదయ్ ప్రకాష్ మాట్లాడుతూ.. కుల, మత, లింగ, వర్ణ బేధాలకు వ్యతిరేకంగా బసవేశ్వర చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. ఆయనను విశ్వగురువుగా, గొప్ప దార్శనికుడిగా సంస్కారవాదిగా ప్రపంచం కీర్తిస్తోందని గుర్తు చేశారు.



సభకు హాజరైన కార్యకర్తలు, జనం



'సంకల్పం' సక్సెస్



కార్యకర్తల జోష్

బీజేపీ ఎన్నికల శంఖారావం

- చేవెళ్ల పట్టణం కాషాయమయం
- ఉత్తేజపర్చిన అమిత్‌షా, ఇతర నేతల ప్రసంగాలు
- విజయ సంకల్ప సభ విజయవంతం
- పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో పాగా వేయడమే లక్ష్యంగా బీజేపీ ఎన్నికల శంఖారావం పూరించింది. చేవెళ్ల లోక్‌సభ కేంద్రంగా ఆదివారం విజయ సంకల్ప సభ నిర్వహించింది. గ్రామీణ ప్రాంతాల నుంచి భారీగా జనసమీకరణ చేపట్టారు. ఆశించినదానికంటే ఎక్కువగా సభకు తరలిరావడం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, చేరికల కమిటీ కన్వీనర్ ఈటల రాజేందర్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, బీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. తమ ప్రసంగాలతో పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచారు. భారత్ మాతాకీ జై, వందే మాతరం నినాదాలతో హోరెత్తించారు. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలోని అన్ని స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అని అభిప్రాయపడ్డారు.



కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి అభివాదం చేస్తున్న అమిత్‌షా

ఆయన ఫాంహౌస్‌లో నిద్రపోతుండు



ప్రధాని మోదీ దేశంకోసం అహర్నిశలు కష్టపడుతుంటే సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌లో నిద్రపోతుండు. రాష్ట్రం, జిల్లాలు, గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం పనిచేస్తుంటే కేసీఆర్ మాత్రం కుటుంబ సంక్షేమం కోసం పాకులాడుతుండు. పేదలకు కేంద్రం ఇచ్చే నిధులు చేరకుండా అడ్డుపడుతుండు. కేంద్ర పథకాలను అడ్డుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పందులు తిరుగుతున్నాయ్. బాలికలకు కనీసం బాత్‌రూంలు లేవు. కరెంటు షాక్ తగిలి ఇటీవల ఓ అమ్మాయి చనిపోయింది. బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులకు కేంద్రం ముందుకొస్తే కేసీఆర్ అడ్డుకుంటుండు. భూసేకరణలో నిర్లక్ష్యం చేస్తుండు.

– కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ

కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్టే



ఒకవైపు బీజేపీ బలపడుతుంటే మరోవైపు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఏకమవుతున్నాయి. కర్ణాటకలో బీజేపీ గెలుపు తరువాత తెలంగాణలో ఆ రెంటు పార్టీల మధ్య పొత్తు ఖాయం. ఈ తొమ్మిదేళ్లలో జిల్లాకు నీళ్ల రాలే, నిధులు రాలే, ఇళ్లు రాలే, ఉద్యోగాలు రాలే. గండిపేట చుట్టూ ఫాంహౌస్‌లు మాత్రం వచ్చాయి. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్టే.

– ప్రేమేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఇంత అవినీతి చూడలేదు



ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత అవినీతికి పాల్పడలేదు. కేసీఆర్‌కు ప్రజల సంక్షేమం కన్నా కుటుంబ సంక్షేమమే ఎక్కువ. మళ్లీ అధికారంలోకి వస్తే ఆయన మనవడికి కూడా పదవి కట్టబెడతాడు. భార్యను కూడా రాజ్యసభకు పంపిస్తాడు. అప్పట్లో అమెరికా నుంచి వచ్చిన కవితకు తొలి ఫోర్డ్ ఐకాన్ కారు నేనే కొనిచ్చాను.

– చంద్రశేఖర్, మాజీ మంత్రి

హామీలను విస్మరించింది



వరద ముంపు నుంచి విముక్తి కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఎల్బీనగర్‌లో ఇప్పటి వరకు నివారణ చర్యలు చేపట్టలేదు. మురుగునీటి కాలువల పనులు మధ్యలోనే వదిలేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు 120 గజాల స్థలాన్ని ఉచితంగా వారి పేరున క్రమబద్ధీకరిస్తామని చెప్పి, ఒక్కో ఇంటి నుంచి రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో 72 వేల మంది డబుల్ బెడ్‌రూం ఇళ్లకోసం దరఖాస్తు చేసుకుంటే 1,320 ఇళ్లు మాత్రమే నిర్మించి మిగతా వాళ్లకు మొండి చెయ్యి చూపించారు.

– సామ రంగారెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు

మంత్రిగా ఉండి ఏం సాధించావ్



ప్రతిపక్షంలో ఉండి ప్రజలకోసం పోరాడాలని మహేశ్వరం ప్రజలు కాంగ్రెస్ తరఫున గెలిపిస్తే సబితారెడ్డి మంత్రి పదవికి ఆశపడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ఏం మాట్లాడావ్.. ఇప్పుడేం మాట్లాడుతున్నావ్. మంత్రిగా ఉండి చేసిందేమిటో చెప్పాలి? ఒకప్పుడు ఫార్మాసిటీకి వ్యతిరేకంగా మాట్లాడి ఇప్పుడు ప్రజల నోట్లో మట్టి కొడుతున్నావు. 111 జీవో ఎత్తేస్తున్నామని చెప్పి ఇప్పటికీ రద్దు చేయలేదు.

– బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు

నిధుల్లేవ్.. నీళ్లులేవ్..

జూరాల ప్రాజెక్టు గ్రావిటీ ద్వారా జిల్లాకు నీరందిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు నిధులు ఇవ్వలే.. చేవెళ్ల, వికారాబాద్‌కు ఇప్పటి వరకు నీల్లు రాలే. కేంద్ర నిధులతో తాండూరులో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఇప్పటికీ ప్రారంభించలేదు. పేపర్ లీకేజీకి పాల్పడి నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా చేశారు. జిల్లాలో చేపట్టిన రోడ్లన్నింటికీ కేంద్రమే నిధులు మంజూరు చేసింది. మెడికల్ కాలేజీ, ఆయూష్ సెంటర్లను ఇచ్చిన ఘనత కేంద్రానిదే.

– సదానందరెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు

'రేషన్'పై ఆరా!

- లబ్ధి కుటుంబాల కేటగిరీ, ఫోన్ నంబర్లు
- డ్రా చేస్తున్న వారి వివరాల సేకరణ
- నగరంలో ప్రయోగాత్మకంగా శ్రీకారం



సాక్షి, సిటీబ్యూరో: ఆహార భద్రత (రేషన్) కార్డు లబ్ధి కుటుంబాల కేటగిరీ(కులాల)పై పౌర సరఫరా శాఖ ఆరా తీస్తోంది. ప్రభుత్వ చౌకధరల దుకాణాల నుంచి సరుకులు డ్రా చేస్తున్న కుటుంబాల కులం, సబ్ కేటగిరీ, ఫోన్ నంబర్ల వివరాలను సేకరిస్తోంది. ప్రయోగాత్మకంగా నగర పరిధిలో ఈ నెలలో శ్రీకారం చుట్టింది. నగరంలోని డీలర్లందరూ కార్డుల వారీగా వివరాలు సేకరించేందుకు ఆదేశాలు జారీ చేసింది. సరుకులు డ్రా చేసే లబ్ధిదారులు ఈ పాస్ యంత్రం బయోమెట్రిక్ పెట్టిన తర్వాత వారి కేటగిరీ, ఉప కేటగిరీ, ఫోన్ నంబర్లు అడిగి ప్రత్యేక నివేదికలో నమోదు చేస్తున్నారు. వాస్తవంగా ఆహార భద్రత కార్డు పేదవారి గుర్తింపు కార్డుగా తయారైంది. దారిద్ర్య రేఖకు దిగువన అర్హులైన కుటుంబాలు నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ ద్వారా సబ్సిడీ రేటుకు ఆహార సరుకులను అందించాల్సి ఉంది. ప్రస్తుతం కరోనా ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో అంత్యోదయ, అన్నపూర్ణ యోజన రేషన్ కార్డులతో పాటు ఆహార భద్రత కార్డు దారులకు సైతం బియ్యం ఉచితంగా పంపిణీ జరుగుతోంది. తాజాగా వివరాలు సేకరణకు కారణమేమిటో సంబంధిత అధికారులు స్పష్టం చేయడం లేదు.

17.22 లక్షల కుటుంబాలు

గ్రేటర్ హైదరాబాద్‌లో ఆహార భద్రత కార్డు(రేషన్) కార్డులు కలిగిన కుటుంబాలు సుమారు17.22 లక్షలపైనే ఉన్నాయి. అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలో 6,39,775, రంగారెడ్డి జిల్లాలో 5,58,680, మేడ్చల్–మల్కాజిగిరి పరిధిలో 5,24,390 కార్డులు ఉన్నాయి. వీటితో పాటు హైదరాబాద్‌కు ఉపాధి కోసం వలస వచ్చిన సరిహద్దు జిల్లాలకు చెందిన రేషన్ కార్డు లబ్ధిదారులు మరో 2.8 లక్షలవరకు ఉంటారన్నది అంచనా. రేషన్ పోర్టబిలిటీ కారణంగా ఆయా కుటుంబాలు కూడా నగర పరిధిలోనే ఉచిత బియ్యం, సబ్సిడీ సరుకులు డ్రా చేస్తుంటాయి. మొత్తం మీద ప్రతి నెల సరుకులు డ్రా చేసే కుటుంబాలు 20 లక్షల వరకు ఉండగా, అందులో 80 నుంచి 90 శాతం కుటుంబాలు ప్రతి నెలా సరుకులు డ్రా చేస్తుంటాయి.

నేడు నెలవారీ సరుకుల డ్రాకు గడువు

గ్రేటర్ పరిధిలో నెలవారీ కోటా సరుకుల డ్రా గడువు ఈ నెల 24తో ముగియనుంది. ఇప్పటి వరకు సుమారు 15,66,085 కుటుంబాలు మాత్రమే సరుకులు డ్రా చేసినట్లు పౌరసరఫరా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి అందులో జిల్లాల వారీగా పరిశీలిస్తే హైదరాబాద్‌లో 5,74,652, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో 4,83,874, రంగారెడ్డి జిల్లా పరిధిలో 5,07,559 మంది కార్డుదారులు సరుకులు డ్రా చేసినట్లు తెలుస్తోంది.



షాబాద్ చౌరస్తా నుంచి ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ దారిమళ్లింపు

- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు, వాహనదారులు

చేవెళ్ల/మొయినాబాద్/శంకర్‌పల్లి: బీజేపీ నిర్వహించిన భారీ బహిరంగ సభకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాకతో పోలీసులు ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. హైదరాబాద్ నుంచి చేవెళ్ల మీదుగా పరిగి, వికారాబాద్, తాండూరు వైపు వెళ్లే వాహనాలు, ఆర్టీసీ బస్సులు అప్ప జంక్షన్ నుంచి దారి మళ్లించి నార్సింగ్, శంకర్‌పల్లి, ఎనికేపల్లి మీదుగా వికారాబాద్ వైపు మళ్లించారు. వికారాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను ఆలూరు, ఎనికేపల్లి, శంకర్‌పల్లి మీదుగా నగరం వైపు వెళ్లేలా మళ్లించారు. చేవెళ్ల, మొయినాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి అన్ని షాపులను మూసివేయించి రోడ్లపై ఎవరినీ తిరగనివ్వలేదు. సాయంత్రం 4 గంటల సమయంలో కొన్ని ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు మొయినాబాద్ నుంచి చేవెళ్లకు రావడంతో వాటిని షాబాద్ రోడ్డు వైపు మళ్లించారు. వికారాబాద్, పరిగి వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు పామెన మీదుగా వెళ్లాల్సి వచ్చింది. హైదరాబాద్ నుంచి చేవెళ్లకు వచ్చే బస్సులను షాబాద్ చౌరస్తా నుంచి దారి మళ్లించడంతో ప్రయాణికులు అక్కడే దిగి నడుచుకుంటూ వెళ్లారు. చిన్న పిల్లలు, లగేజీ బ్యాగులతో ఇబ్బంది పడ్డారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల వరకు ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేశారు. అమిత్‌షా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి చేవెళ్ల సభా వేదికకు చేరుకునేంత వరకు రోడ్డుపై ఒక్క వాహనాన్ని కూడా తిరగనివ్వలేదు.

ప్రశ్నించే గొంతుకను ఎవరూ ఆపలేరు

హఫీజ్‌పేట్: ప్రశ్నించే గొంతుకలను ఎన్ని నిర్బంధాలు పెట్టినా ఆపలేరని ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రధాన గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం సీనియర్ జర్నలిస్ట్ తెలకపల్లి రవి రచించిన 'శ్రీశ్రీ జయభేరి' పుస్తకావిష్కరణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోరటి వెంకన్న మాట్లాడుతూ. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలన్నింటినీ కేవలం నిర్బంధం ద్వారా ఆపాలని చూస్తోందన్నారు. ఇలాంటి నిర్బంధాలను తట్టుకొని ఈ సమాజం అభివృద్ధి వైపు ప్రయాణిస్తుందన్నారు. దేశాన్ని మళ్లీ మధ్యయుగాల కాలానికి తీసుకెళ్లే ఆలోచనతో పరిపాలిస్తోందని ఆరోపించారు. ఎప్పటికీ ప్రగతిశీల భావాలకు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం జరుగుతూనే ఉంటుందని, ఆ పోరాటంలో ప్రగతిశీల శక్తులే విజయం సాధిస్తాయన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత తెలకపల్లి రవి, తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు పాల్గొన్నారు.

బీసీ జర్నలిస్టులది కీలక పాత్ర

ఖైరతాబాద్: తెలంగాణ ఉద్యమంలో బీసీ జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావానంతరం జర్నలిస్టులకు అన్యాయం జరిగిన మాట వాస్తవమని చెప్పారు. ఆదివారం విశ్వేశ్వరయ్య భవన్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ జర్నలిస్టుల సమ్మేళనానికి హాజరైన ఈటల మాట్లాడుతూ.. తెలంగాణలో జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, అర్హులైన వారికి హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

డంపింగ్ యార్డును అడ్డుకుంటాం

పస్మాముల గ్రామస్తుల తీర్మానం

హయత్‌నగర్: గ్రామంలోని రామాలయం వద్ద మున్సిపల్ శాఖ ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును కలిసి కట్టుగా అడ్డుకోవాలని ప్మాముల గ్రామస్తులు తీర్మానించారు. డంపింగ్ యార్డు, మురుగు నీటి సమస్యలపై ఆదివారం గ్రామంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును పక్క గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారనే కారణంగా దాన్ని రామాలయం సమీపంలోకి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, భూ సర్వే కోసం కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డు మా గ్రామ రెవెన్యూ పరిధిలోనే ఉందని, గతంలో రూ. 80లక్షల వ్యయంతో అక్కడ ఏర్పాటు చేశారని, దాన్ని తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మురుగు నీరు గ్రామంలోని చెరువులోకి చేరుతుండడంతో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీనికి తోడు చెత్త డంపింగ్ చేస్తే గ్రామంలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును ఉన్న చోటి నుంచి తరలించకుండా పార్టీలకు అతీతంగా అందరూ ఏకమై పోరాడాలని తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సీ స్వప్న, మాజీ సర్పంచులు కే జైపాల్‌రెడ్డి, సీ శంకరయ్యగౌడ్, మాజీ కౌన్సిలర్ జీ భాస్కర్‌గౌడ్, యువజన, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న స్థానికులు

కుక్కల దాడిలో 40గొర్రెల మృతి

శంకర్‌పల్లి: కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడంతో 40 జీవాలు మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పర్వేద గ్రామానికి చెందిన జీ అనంతయ్య గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. శనివారం గొర్రెలను మేపుకొని గ్రామ శివారులో ఏర్పాటు చేసిన మందలో ఉంచి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా మందలో కుక్కలు కనిపించడంతో అనంతయ్య ఆందోళన చెందాడు. పెద్ద సంఖ్యలో గొర్రెలు మృత్యువాత పడడంతో బాధితులు బోరున విలపించారు. 30 గొర్రెలు, 10 గొర్రె పిల్లలు మృతి చెందాయని, వాటి విలువ సుమారు రూ. 3లక్షల, 50వేల వరకు ఉంటుందని తెలిపారు. బాధితుడు అనంతయ్యను సర్పంచ్ అనిత పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు.



కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు



చేవెళ్ల: బసవేశ్వరుడి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు



షాద్‌నగర్: బసవేశ్వరుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, సంఘం నాయకులు



కడ్తాల్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, నాయకులు, వివిధ సంఘాల నేతలు

మహనీయుల అడుగుజాడల్లో నడుద్దాం

ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, కాలె యాదయ్య

చేవెళ్ల: మహనీయులు చూపిన మార్గంలో నడుద్దామని, వారి ఆదేశాలు అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్లలోని బసవేశ్వరుని విగ్రహం వద్ద ఆదివారం లింగాయత్ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, వర్ణ, లింగ వ్యవస్థలు లేని సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహా నాయకుడని కొనియాడారు. లింగాయత్ సంఘం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రభు లింగం, శివానందం, శివప్రసాద్, వీరేశం, నాగరాజు, సంగమేశ్వర్, ఎంపీపీ ఎం విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ కే శివప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, ప్రభాకర్, నర్సింలు, కే శివకుమార్, జహంగీర్, గని, మాజీ వైస్ ఎంపీపీ శివానందం, అంజయ్య, ఎం శ్రీను, సత్యం, విఠలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహనీయులు చూపిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ల డీ వెంకట్‌రెడ్డి, జీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు వసంతం, రాములు, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నాయకులు ఆగిరెడ్డి, మధుసుదన్ గుప్తా, జీ యాదయ్య, టీ శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాములు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయవాది బసవేశ్వరుడు

షాద్‌నగర్: సమాజంలో లింగ వివక్షతను వ్యతిరేకించిన అభ్యుదయవాది బసవేశ్వరుడు అని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం బసవేశ్వర జయంతిని వీరశైవ సమాజం ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మల్లికార్జున కాలనీలో ఉన్న బసవేశ్వర విగ్రహానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, వీరశైవ సమాజం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బసవేశ్వరుడు హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖుల్లో ఒకరిని అన్నారు. సమాజంలో కుల, వర్ణ, లింగ భేదాలు లేవని, అందరు సమానమేనని చాటి చెప్పారని అన్నారు. బసవేశ్వరుడు అనేక సాంఘిక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. బసవేశ్వరుడి ఆశయాలు కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కే నరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఏ విశ్వం, సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు దేవి, ప్రసన్నాంబిక పాల్గొన్నారు.

బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తి దాయకం

కడ్తాల్: సంఘ సంస్కర్త, మత గురువు బసవేశ్వరుడి బోధనలు నేటి సమాజానికి స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమాజం ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుడి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన బసవేశ్వరుడి గొప్పతనాన్ని, ధర్మాన్ని వివరించారు. సమాజంలో మానవులందరూ ఒక్కటేనని, శ్రమను మించిన సౌందర్యం లేదని, వీరశైవ సంప్రదాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప మహనీయుడు కొనియాడారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ మండల అధ్యక్షుడు ఎస్ ఈశ్వరప్ప, సింగిల్‌విండో చైర్మన్ జీ వెంకటేశ్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, సీఐ ఉపేందర్, రాష్ట్ర నాయకులు సర్వేశ్వర్, మల్లప్ప, శరణప్ప, సమాజం వ్యవస్థాపకులు అనిల్‌కుమార్, సాంబయ్య, శ్రావణ్‌కుమార్, ప్రభు, ప్రేమ్‌కుమార్, విజయ్‌కుమార్, డాక్టర్ రమేశ్ అయ్యగార్, వీరేశ్, వినోద్, రాజు, విద్యాసాగర్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో బీఆర్ఎస్ సమ్మేళనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో మే మొదటి వారంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర స్థాయి తొలి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీ దశరథ్ తెలిపారు. ఆదివారం ఓయూలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ 9 ఏళ్ల పాలనలో విద్యా రంగం అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలతో పాటు జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, మండలానికి గురుకుల పాఠశాలలు, కళాశాలు, హాస్టల్స్, వర్సిటీలలో మౌలిక వసతులుతదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా, మండలస్థాయి నుంచి వర్సిటీలు, వివిధ కాజీలలో బీఆర్ఎస్వీ బలోపేతానికి అనుసరించాల్సిన భవిష్యత్తు వ్యూహాలను రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ సమ్మేళనానికి అన్ని జిల్లాల కోఆర్డినేటర్లు, మండల, నియోజకవర్గాల నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.

డివైడర్ ఎక్కించి.. బైక్‌ను ఢీకొట్టి..

- డీసీఎం బీభత్సం. మద్యం మత్తులో డ్రైవర్
- కాబోయే దంపతులకు తీవ్ర గాయాలు

పహాడీషరీఫ్: తాగిన మైకంలో డీసీఎం డ్రైవర్ రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఎక్కించి అవతలి వైపు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న కాబోయే దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్ఐ సీ వెంకటయ్య కథనం మేరకు.. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామానికి చెందిన జానకీరాం కుమార్తె వీ ప్రియదర్శిని ఇబ్రహీంపట్నంలోని శ్రీదత్త ఇన్‌స్టిట్యూట్‌లో ఎం-ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమెకు కడ్తాల్ మండలం డాసర్ల పల్లి ప్రాంతానికి చెందిన నేనావత్ జైపాల్‌తో వివాహం కుదిరింది. ఆదివారం మధ్యాహ్నం వీరు బైక్‌పై కడ్తాల్‌కు బయలుదేరారు. మధ్యాహ్నం 1.20 గంటలకు తుక్కుగూడ హైవేలోని టీఎస్ఐఐసీ కార్యాలయం వద్దకు రాగానే.. తుక్కుగూడ నుంచి వస్తున్న డీసీఎం వ్యాన్ రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఎక్కించి ఇవతలి రోడ్డులో వస్తున్న బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ప్రియదర్శిని, జైపాల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ప్రియదర్శిని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా డీసీఎం డ్రైవర్ తాగి వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.



డివైడర్ దాటి దూసుకొచ్చిన వాహనం

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- సినీనటుడు కిరణ్‌కుమార్
- విజేత జట్లకు బహుమతుల ప్రదానం



విజేత జట్లతో కిరణ్‌కుమార్, నిర్వాహకులు

హుడాకాంప్లెక్స్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సినీనటుడు, తెలంగాణ మా అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ సూచించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదరణ, సునీత ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదరణ అమితాభ విద్యాలయ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్రికెట్, కబడ్డీ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపుతో పాటు దేశానికి, రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించే అరుదైన గౌరవం దక్కుతుందన్నారు. విద్యార్థులు మానసిక, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదిగేందుకు క్రీడలు ఉపయోగపడతాయని చెప్పారు. క్రీడలను జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. ఆదరణ, సునీత ఫౌండేషన్లు ముందుకు వచ్చి ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విజేత జట్లకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆదరణ ఫౌండేషన్ చైర్మన్ జేడీ మాధవరావు, సునీత ఫౌండేషన్ చైర్మన్ సునీతారెడ్డి, ఉపాధ్యక్షురాలు వెంకటేశ్వర్‌రావు, అమితభా ఫౌండర్ అధ్యక్షురాలు పూజ, ప్రధాన కార్యదర్శి ఎం నాగరాజు, ఆనంద్, ప్రహ్లాద్, వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్టు

రూ. 6లక్షల విలువైన వాహనాలు స్వాధీనం

మలక్‌పేట: విలాసాలు, చెడు వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి బైకుల చోరీకి పాల్పడుతున్నాడు. ఈమేరకు పోలీసులు అతన్ని అరెస్టు చేసి రూ.6 లక్షలు విలువైన బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ శ్యామ్‌సుందర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ భాస్కర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. చౌటుప్పల్ మండలం తంగడపల్లి బీరప్ప కాలనీ చెందిన ఓర్సు యాదయ్య స్టోన్‌క్రషర్ కంపెనీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో డబ్బుల ఆశకు పోయి బైకుల దొంగతనాలు ప్రారంభించాడు. రాత్రి సమయాల్లో ఒంటరిగా ఉన్న ప్రాంతాలను రెక్కీ చేసి, స్నేహితుడైన మైనర్ బాలునితో కలిసి బైక్‌లు దొంగతనం చేయడం షురూ చేశాడు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల హ్యాండిల్ లాక్ బ్రేక్ చేసి, వైర్ కనెక్ట్ ద్వారా వాహనాలు దొంగతనం చేస్తున్నారు. ఆ తర్వాత ఆ వాహనాల నెంబర్ ప్లేట్స్‌ను తొలగిస్తున్నారు. క్రైమ్ సిబ్బంది గడ్డిఅన్నారం ఎక్స్‌రోడ్‌లో వాహనాలు తనిఖీలు చేస్తుండగా యాదయ్య, మైనర్ బాలుడు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజాన్ని అంగీకరించారు. మలక్‌పేట పీఎస్‌లో 2, వనస్థలిపురం పీఎస్ పరిధిలో 2, బజాజ్ బాక్సర్ వాహనం మొత్తం ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యాదయ్యను రిమాండ్‌కు, బాలుడుని జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు. డీఎస్సై సాయితేజారెడ్డి, క్రైమ్ సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను చూపిస్తున్న ఏసీపీ శ్యామ్‌సుందర్, పోలీసు సిబ్బంది

కమలోత్సాహం



బీజేపీ విజయ సంకల్ప సభకు భారీగా తరలివచ్చిన జనం

- సభ విజయవంతంతో బీజేపీ శ్రేణుల్లో జోష్
- భారీగా తరలివచ్చిన జనం
- ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

చేవెళ్ల/మొయినాబాద్/శంకర్‌పల్లి: విజయ సంకల్ప సభ జయప్రదం కావడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది. భారీగా జనాన్ని తరలించడం ద్వారా పార్టీ సత్తాచాటారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రావడంతో జనసమీకరణపైనా దృష్టి సారించటంతో సభ సక్సెస్ అయింది. పట్టణంలోని రోడ్లన్నీ బీజేపీ జెండాలతో నిండిపోయాయి. నాయకులు ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎండ ప్రభావంతో సాయంత్రం 6గంటల తర్వాతే జనం సభా ప్రాంగణంలోకి చేరుకున్నారు. అంతకు ముందు సందడి కనిపించకపోవడంతో మీటింగ్ విజయవంతంపై అనుమానాలు రేకెత్తాయి. కేవలం గంట వ్యవధిలోనే తరలివచ్చిన కార్యకర్తలతో సభా ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వేదికపైకి వచ్చేసరికి జన పెద్దసంఖ్యలో చేరుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన బీజేపీ సభల్లో ఇంత పెద్ద ఎత్తున విజయవంతమైన మీటింగ్ ఇదే కావడం గమనార్హం. సభ జయప్రదం కావడంతో ఇతర పార్టీల నాయకులు ఆలోచనలో పడే పరిస్థితి నెలకొంది.



కళాకారుల ధూంధాం

అన్ని ఏర్పాట్లు

సభకు వచ్చిన జనం ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి కాలం కావడంతో అన్ని గ్యాలరీల ముందు వాటర్ బాటిళ్ల ఏర్పాటు చేశారు. అయితే ఈ సభలో మహిళలు ఆశించిన స్థాయిలో కనిపించలేదు. పార్టీ వలంటీర్లు ఎక్కడిక్కడే ప్రజలను సభలో కూర్చునే విధంగా అందుబాటులోఉండి సేవలు అందించారు.

అధికారమే ధ్యేయమవ్వాలి..

అమిత్‌షా సభ వేదికపైకి ముఖ్య నేతలకు మినహా.. స్థానిక నాయకులకును అనుమతించలేదు. దీంతో వేదిక వెనకభాగంలో నిలబడి అంతా సభావేదిక వెనకబాగంలో నిలబడి అమిత్‌షాను కలిశారు. అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేయాలని అమిత్‌షా వారికి సూచించారు.

ట్రస్ట్ పేరుతో టోపీ!

సాక్షి, సిటీబ్యూరో: వివిధ దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న చిన్నారులను ఆదుకునే పేరుతో నకిలీ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఓ ద్వయం అందినకాడికి దండుకుంటోంది. కర్ణాటకలోని బెంగళూరుతో పాటు హైదరాబాద్‌లోనూ బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి, కాల్ సెంటర్ నుంచి టెలీకాలర్ల ద్వారా దందా చేస్తోంది. దీనిపై ఫిర్యాదు అందుకున్న బెంగళూరు సీసీబీ పోలీసులు శనివారం ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీరి చేతిలో మోసపోయిన వారిలో తెలంగాణకు చెందిన వాళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నారని అధికారులు చెబుతున్నారు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు చెందిన అజయ్ ఎన్వీ, వెంకటాచలపతి సంయుక్తంగా చైల్డ్ లైఫ్ ఫౌండేషన్ పేరుతో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా బెంగళూరులో కేఆర్ అండ్ లవ్, ఆశా కుటీర్ ఫౌండేషన్, హైదరాబాద్‌లో వీ4 పేరుతో సంస్థలు నెలకొల్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండా, సంబంధిత శాఖల వద్ద రిజిస్ట్రేషన్ చేయించకుండా తమ పని ప్రారంభించారు. ఆయా పత్రాలన్నింటినీ నకిలీవి సృష్టించారు. వీటితో పాటు తాము ఆదుకున్న చిన్నారులు అంటూ నకిలీ ఫొటోలు, తమకు ఇప్పటి వరకు డొనేషన్లు ఇచ్చిన వారి వివరాలని చెప్తూ నకిలీ రసీదులు సృష్టించారు. వీటన్నింటినీ తమ సంస్థ పేరుతో రూపొందించిన వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. బెంగళూరులోని బొమ్మనహళ్లిలో ఉన్న అక్యుమెన్‌ట్రిక్స్ భవనంలో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. కొందరు టెలీకాలర్లను నియమించుకున్న ఈ ద్వయం వివిధ మార్గాల్లో తెలంగాణ, కర్ణాటకలకు చెందిన అనేక మంది ఫోన్ నెంబర్లు సంగ్రహించారు. వీరికి ఫోన్లు చేయిస్తున్న అజయ్, వెంకటాచలపతి తాము చిన్నారులను ఆదుకుంటున్నామని నమ్మబలుకుతూ తమ వెబ్‌సైట్ చూసేలా చేస్తున్నారు. ఇలా వీరి వల్లోపడుతున్న అనేక మంది నుంచి డొనేషన్ల పేరుతో అందినకాడికి తమ ఖాతాల్లో బదిలీ చేయించుకుంటున్నారు. దీనిపై బెంగళూరు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి శృతి యా బాయ్ అక్కడి సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి భారీ స్థాయిలో మోసం జరిగినట్లు నిర్ధారించారు. శనివారం కాల్ సెంటర్‌పై దాడి చేసి అజయ్, వెంకటాచలపతిలను అరెస్టు చేశారు.